క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: శ్రీకళాంజలి కళాపరిషత్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం నిర్వహించిన ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు ఆర్.వేణు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన గాయనీ గాయకులు ఆర్వీ రమేష్, కె.అన్నపూర్ణ, ఒ.రాజ్యలక్ష్మి, మహేశ్వరి, టీవీ శేషగిరిరావు, రవికుమార్, శ్రీనివాసకుమార్, రవిశంకర్, ఎస్‌కే వలి, వైవీ రావ్, దయానంద్ పలు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకుడు వేణు మాట్లాడుతూ గాయనీగాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గాయకులు నిత్యం సాధన చేయాలని సూచించారు.

'ధర్మపథం'లో ఆధ్యాత్మిక ప్రవచనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. బ్రహ్మశ్రీ శలాక రఘునాథ శర్మ పలు ఆధ్యాత్మిక అంశాలను భక్తులకు వివరించారు. ప్రవచనం సందర్భంగా రఘునాథ శర్మను ఆలయ అర్చకులు, వేద పండితులు పూలమాలతో సత్కరించారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ప్రసాదాలను అందజేశారు.

కేరళ వరద బాధితులకు ఆర్థిక సాయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా నిరాశ్రయులైన వారి సహాయార్థం భారత స్నేహ, సాంస్కృతిక సహకారం సంఘం (ఇస్కఫ్) రూ. 25వేలు ఆర్థిక సాయం ప్రకటించింది. ఇస్కఫ్ జాతీయ సమితి పిలుపు మేరకు నగరానికి చెందిన ఇస్కఫ్ మిత్రులు రూ. 25వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఇస్కఫ్ ఏపీ ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్‌కు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి అజయ్‌కుమార్, మోతుకూరి అరుణ్‌కుమార్ అందజేశారు. దీనికి తోడు ఇస్కఫ్ పత్రిక మైత్రి నిర్వహణ కోసం రూ. 10వేలు అందజేశారు.

చిన్నారులు క్రీడల్లో రాణించాలి

పటమట(విజయవాడతూర్పు): చిన్నారులు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి వీఎంసీకి ఖ్యాతి తీసుకురావాలని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం నగర పర్యటనలో భాగంగా ఆయన పటమట ఫన్‌టైం క్లబ్, గురునానక్‌కాలనీ, కన్నానగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఫన్ టైం క్లబ్‌లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో మాట్లాడుతూ ఆటల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అక్కడున్న వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పటమటలోని కన్నానగర్‌లో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. ఖాళీ ప్రాంతాలను వాటి యజమానులు శుభ్రపరుస్తూ, వర్షం నీటి నిల్వల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో సర్కిల్–3 జోనల్ కమిషనర్ శివరామకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేస్తూ దొరికిపోయాడు!

పెనమలూరు: దొంగతనం చేస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించటంతో శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు తాడిగడప డొంక రోడ్డు శివపార్వతీ రెసిడెన్సీకి చెందిన దాసరి ఆదిశేషు గ్రామంలో గత 10 సంవత్సరాలుగా జనరల్ స్టోర్స్ పెట్టుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. యథావిధిగా శుక్రవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత కొద్దిసేపటికి గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆదిశేషు ఇంటికి వచ్చి మీ షాపులోపల ఏదో అలికిడి అవుతోందని చెప్పాడు. వెంటనే ఆదిశేషు స్థానికులను వెంటబెట్టుకుని షాపు వద్దకు వచ్చి చూడగా, షాపు పైకప్పు రేకులు పగిలి ఉన్నాయి. షాపు తాళం తీసి తలుపులు తెరవగా షాపులోపల ఓ వ్యక్తి ఉండటాన్ని గమనించారు. వెంటనే అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు కానూరు పాత చెక్‌పోస్టుకు చెందిన వెంకటేష్‌గా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మత్తుతో యువత జీవితాలు చిత్తు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ నారాయణరావు



కేబీఎన్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మత్తు పదార్థాలతో యువత జీవితాలు నాశనమవుతాయని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 'యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం' ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన యువత వారి కుటుంబానికే కాకుండా సమాజానికి సైతం ప్రమాదకరమన్నారు. దేశంలో అత్యధికంగా ఉన్న యువత మత్తుకు చేరువైతే దేశాభ్యున్నతి కుంటుపడుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశంలో క్యాంపెయిన్ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా అన్ని విద్యాసంస్థల్లో యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, కల్మాబేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కళ్యాణోత్సవాన్ని జరిపిస్తున్న ఆలయ అర్చకులు



కమిషనర్ సత్యనారాయణకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శనివారం శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. దుర్గగుడిలోని నటరాజ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు స్వామి వారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు కల్యాణోత్సవం జరిపించుకోవడంతో కలిగే మేలును వివరించారు. వివాహ యోగం, సంతాన యోగం, ధన యోగంతోపాటు కుటుంబ సమస్యలు దూరమవుతాయని వివరించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాస శాస్త్రి కళ్యాణోత్సవాన్ని జరిపించారు.

స్వామి వారి సేవలో కమిషనర్ సత్యనారాయణ..

దుర్గమ్మను దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగదేవత విగ్రహాలను, నాగపుట్టలో పాలు పోసి పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ ఈవో కెఎస్.రామరావు అమ్మవారి ప్రసాదాలను కమిషనర్‌కు అందచేశారు.

ఆర్థికసాయం, ప్రత్యామ్నాయ ఉపాధి చూపండి

రవాణాశాఖ మంత్రికి ఆటోకార్మికుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకం అమలు చేస్తే తాము జీవనోపాధి కోల్పోతామని ఆటో, మోటారు రంగ కార్మికులు రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డికి తెలిపారు. అందువల్ల తమకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), ఏపీ ప్రగతిశీల ఆటో, మోటారు వర్కర్స్ యూనియన్ నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డిని విజయవాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించే పథకాన్ని అమలు చేస్తే ఆటో, క్యాబ్ తదితర మోటార్ కార్మికులకు జీవనోపాధి ఉండదని చెప్పారు. ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆటో కార్మికులకు ఆర్థిక సహాయంగా అందిస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ పథకంలో భాగంగా తమకు ఏడాదికి రూ.15 వేలు కాకుండా రూ.25 వేలు ఇవ్వాలని మంత్రిని కోరారు.

ఆటో, మోటారు కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

మోటారు రంగంలో పెనాల్టీలకు సంబంధించిన జీవో నెంబరు–21ని రద్దు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని మంత్రికి కార్మిక సంఘాల నాయకులు గుర్తు చేశారు. జీవో నంబర్ 21 రద్దుచేసి 2019 సంవత్సరానికి ముందు నాటి పాత పెనాల్టీ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఆటో మోటారు కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. ఈ బోర్డులో అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులకు అవకాశం కల్పించాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణ పథకంతో నష్టపోయే కార్మికులందరికీ న్యాయం చేస్తామని మంత్రి తమకు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఆటో, మోటారు వర్కర్స్ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు, సలహాలు తీసుకుంటామని మంత్రి చెప్పారన్నారు. కార్మిక సంఘాల నాయకులు ఎ.రవిచంద్ర, డి.శ్రీనివాసరావు, ముని శంకర్, సీహెచ్ పెద్ది రాజు, పి.రఫీఖాన్, డి.శ్రీధర్ బాబు, రాము తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

జాబ్‌మేళా



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం ఎన్డీఏ కార్యాలయంలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యాన జాబ్‌మేళా జరిగింది. మేళాలో 4,800 మంది పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. 41 సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. తొలివిడతగా 400 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మరో 1,280 మందికి సంస్థల ఉన్నతాధికారుల నుంచి అప్రూవల్స్ తీసుకుని ఆగస్టు 15లోగా రెండోవిడతలో నియామక పత్రాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సుజనా ఫౌండేషన్ సీఈఓ పీవీ రావు, కో ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ చింతపల్లి అజయ్, మోహన్ వంశీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ



మైలవరం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మైలవరం సీపీఎం కార్యాలయం వద్ద శనివారం జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ చేసిన పోరాటాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రచురించిన టెట్ అండ్ డీఎస్సీ మెటీరియల్‌ను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో నిరుపేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఆమె చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద, అనాథ, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులను గుర్తించి వారికి రెగ్యులర్‌గా నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సేవలను అభినందించారు. పౌష్టికాహారం ఏఆర్‌టీ చికిత్సతో హెచ్‌ఐవీ సోకిన వారి జీవన ప్రమాణం పెంచవచ్చన్నారు. నిరుపేద హెచ్‌ఐవీ సోకిన చిన్నారులకు స్కూలు, కళాశాలల ఫీజు చెల్లించేందుకు లెప్రా సొసైటీ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చిందని అటువంటి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



హిమబిందు, పూర్ణచంద్రరావు దంపతులను సత్కరిస్తున్న విజయలక్ష్మి, భార్గవ్ తదితరులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళాసంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. జ్ఞానదా కల్చరల్ ట్రస్ట్ 9వ వార్షికోత్సవం, ఆధ్యాత్మిక సంగీత కచేరి, సాంస్కృతిక రంగ ప్రముఖులు హిమబిందు, పూర్ణచంద్రరావులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కవులు, కళాకారులు, సంగీత విద్వాంసులకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరముందన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు హిమబిందు మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించడానికి సంగీత కచేరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిజ్ఞాసన వ్యవస్థాపకుడు భార్గవ్ మాట్లాడుతూ సాంస్కృతిక కళారాజధానిగా విజయవాడను అభివర్ణించారు. వివిధ రంగాలకు చెందిన సూరంపూడి భాను కామేశ్వరి, ఎం.కామేశ్వరి, కార్తీకవల్లి, స్వాతి తదితరులు తెలుగు వారి సంగీత సాహిత్యం రంగాలు అంశంగా ప్రసంగించారు. సాంస్కృతిక రంగ ప్రముఖులు హిమబిందు, పూర్ణచంద్రరావు దంపతులను సత్కరించారు. హిమబిందు శిష్యబృందం పలు భక్తి గీతాలను ఆలపించింది.

బాధ్యతాయుతమైన దేశభక్తులుగా విద్యార్థులు తయారు కావాలి

విద్యాభారతి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు బాధ్యతగల దేశభక్తులుగా, భావి భారతావనిని తీర్చిదిద్దే పౌరులుగా తయారుకావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, విద్యాభారతి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గొల్లపల్లి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. భవానీపురంలోని విజ్ఞాన విహార్ పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు భారతీయ జ్ఞాన పరంపరకు సంబంధించిన అంశాలను బోధించాలని సూచించారు. దీంతో విద్యార్థి భారతీయ ఔన్నత్యాన్ని తెలుసుకుని నిజమైన దేశభక్తుడిగా, దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషించే పౌరుడిగా నిలుస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి కోశాధికారి, రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, పాఠశాల అకడమిక్ అడ్వైజర్ సూర్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌ఎస్‌జీ అన్నపూర్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

• నగరంలో సైబర్ వాక్‌థాన్





నగరంలో శనివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యాన సైబర్ వాక్‌థాన్(సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ) జరిగింది. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. బెంజిసర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. వాక్‌థాన్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

సోషల్ మీడియాలో దుర్గమ్మ అంతరాలయం!

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి అంతరాలయంలో అమ్మవారి మూలవిరాట్ వీడియో శనివారం ఉదయం నుంచి మరోమారు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. గతంలో ఇదే తరహాలో సోషల్ మీడియాలో అంతరాలయంలోని అమ్మవారి మూలవిరాట్ వీడియోను ఓ భక్తురాలు అప్‌లోడ్ చేసింది. అప్పట్లో ఆలయ అధికారులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. తాజాగా శుక్రవారం అమ్మవారి దర్శనం చేసుకోండంటూ ఓ వీడియో సోషల్‌మీడియాలో కనిపించింది. ఇది ఇటీవల సాయంత్రం వేళ వర్షాలు కురుస్తున్న తరుణంలో తీసిందేనని తెలుస్తోంది. వీడియో తీసిన సమయంలో అమ్మవారి పంచ హారతులకు సిద్ధం చేస్తున్న తరుణంలో భక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు సమాచారం. దీనిపై ఆలయ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. అమ్మవారి ఆలయంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. కొంతమంది భక్తులు సెక్యూరిటీ సిబ్బంది కళ్లుకప్పి ఆలయంలో సెల్‌ఫోన్‌ను ఉపయోగిస్తున్న సందర్భాలు చోటు చేసుకుంటున్నాయి. అటువంటి ఘటనలు జరిగినప్పుడు ఎస్‌పీఎఫ్ సిబ్బంది భక్తుల నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని వీడియోను, ఫొటోలను డిలీట్ చేయిస్తుంటారు. హారతుల కోసం సర్వదర్శనం క్యూలో వేచి ఉన్న భక్తులు ఈ వీడియో తీసి ఉంటారని ఆలయ అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దృష్టికి తీసుకువెళ్లి వీడియో తీసిన భక్తులపై చర్యలు తీసుకుంటామని ఆలయ పర్యవేక్షకులు పేర్కొంటున్నారు. దేవస్థానంలోని సీసీ ఫుటేజీని పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయిన్లతో పాటు, ప్రధాన రహదారి, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను శనివారం మినీ జేసీబీ సహాయంతో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లలోని చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

దళితులను విడదీసే కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

మాలల 'జేఏసీ' సమావేశంలో నేతలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రిజర్వేషన్లను సమూలంగా నాశనం చేయాలనే కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణపై తీర్పు అని పలువురు వక్తలు అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో మాలల జేఏసీ ఆధ్వర్యాన శనివారం వర్గీకరణ వద్దు, దళితుల ఐక్యతే ముద్దు అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాజీ ఎంపీ హర్షకుమార్, ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాజ్యాధికారానికి దూరం చేయడానికి, ఐక్యతను విడదీయడానికి జరిగిన కుట్ర ఇదని ఆరోపించారు. మాలల జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై వివక్ష ఈ తీర్పుతో మరోసారి నిరూపితమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సరైన అధ్యయనం లేకుండా జిల్లాల వారీగా వర్గీకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యాచరణలో భాగంగా జేఏసీ ఇచ్చే పిలుపునకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా మాలలందరూ కుట్రపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో.. రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో కూడా క్రీమీలేయర్ వర్తింప చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ చేపట్టే నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. జేఏసీ నాయకులు ఎం.రాంబాబు, ఎం.వెంకటరావు, జయకుమార్, పి.రమేష్, దిలీప్, రాజా తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్స్

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం పోలీసులు రిహార్సల్స్ చేశారు. ఇక్కడ వేడుకల నిర్వహణకు స్టేడియాన్ని ముస్తాబు చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

